ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
ఆదివారం 21 జనవరి 2024

పచ్చని సంసారంలో మద్యం చిచ్చు

తాగుడుకు డబ్బులు తగలేయడం ఎందుకని ప్రశ్నించిన భార్య



ఆత్మహత్య చేసుకున్న దంపతులు

- మనస్తాపంతో ఉరేసుకున్న భర్త
- ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే కన్నుమూత
- విషయం తెలిసి భార్య ఆత్మహత్య

మద్యం.. పచ్చని సంసారంలో చిచ్చు రేపింది. అన్యోన్యంగా ఉండే దంపతులను బలి తీసుకుంది. రెండు నిండు ప్రాణాల బలవన్మరణానికి దారితీసింది. దంపతుల ఒక్కగానొక్క కొడుకుని ఒంటరిని చేసింది. మద్యానికి డబ్బులు తగలేయడం ఎందుకని భార్య ప్రశ్నించినందుకు మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసి కలతచెందిన భార్య కూడా బలవన్మరణానికి పాల్పడింది. ఈ దారుణం గుడివాడలో శనివారం చోటుచేసుకుంది.

గుడివాడ, జనవరి 20 : గుడివాడలోని వాసవీనగర్‌కు చెందిన కొలుసు రాంబాబు (45) ప్రైవేట్ ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి మద్యం సేవించే అలవాటుంది. తనకు రావలసిన రూ.4000 మొత్తాన్ని తనకు ఫోన్‌పే లేకపోవడంతో భార్య కనకదుర్గ (40) ఫోన్‌పే నంబర్‌కు పంపించాడు. శనివారం తెల్లవారుజామున డ్యూటీ దిగి వస్తూ కొడుకు గౌతమ్‌కు ఫోన్ చేసి తల్లి అకౌంట్‌లో ఉన్న డబ్బుల్లో నుంచి రూ.500 తాను చెప్పే నెంబరుకు పంపమని కోరాడు. కొడుకు సదరు నంబరుకు రూ.500 పంపగా వాటితో రాంబాబు మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. మెకానిక్‌గా పనిచేస్తున్న కొడుకు వద్దకు మధ్యాహ్నం వెళ్లి మరో రూ.500 ఆ నంబరుకు వేయాలని తండ్రి కోరాడు. తల్లికి ఫోన్ చేసి వాటిని కూడా పంపించాడు. వాటితో మద్యం సేవించి ఇంటికి వెళ్లిన భర్తను చూసి భార్య డబ్బులు ఎందుకు దుబారా చేస్తున్నారంటూ ప్రశ్నించింది. మనస్థాపానికి గురైన రాంబాబు ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. భర్త ఉరివేసుకున్నట్టు కనకదుర్గ తన కొడుక్కి ఫోన్ చేసి చెప్పింది. దీంతో కొడుకు ఇంటికి వచ్చిన తండ్రిని ఆసుపత్రికి తీసుకు వెళ్లగా అప్పటికే రాంబాబు మృతి చెందాడు. తండ్రి చనిపోయిన విషయాన్ని కొడుకు తల్లికి తెలియజేశాడు. దీంతో మనస్థాపానికి గురైన కనకదుర్గ ఇంట్లోనే ఉరివేసుకుని మృతి చెందింది. తండ్రి శవాన్ని తీసుకుని ఇంటికి వచ్చిన కొడుకు తల్లి కూడా ఉరి వేసుకుని మృతి చెంది ఉండటాన్ని గమనించి షాక్‌కు గురయ్యాడు. అమ్మనైనా కాపాడుకుందాం అనుకున్న కుమారుడి ప్రయత్నం సఫలం కాలేదు. ఏనాడు ఇరువురు గొడవ పడిన సందర్భం లేదని, అన్యోన్యంగా ఉండే వాళ్లని స్థానికులు తెలిపారు. తల్లిదండ్రులను కాపాడుకు నేందుకు కొడుకు చేసిన ప్రయత్నాలు విఫలమవ్వడంతో కంటతడి పెట్టుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా భూముల్లో ఇసుక తవ్వొద్దు
- 6లో..

దళితులపైనే వేటు!



రక్షణనిధి



మొండితోక జగన్మోహనరావు



కైలే అనిల్ కుమార్

ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో సిటింగ్‌లందరికీ మొండిచేయి

వైసీపీ అధినేత జగన్ మాటల్లో దళితులపై ఎక్కడలేని ప్రేమ కనిపిస్తుంటుంది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటుంది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మూడు ఎస్సీ రిజర్వ్ స్థానాల్లోనూ సిటింగ్ ఎమ్మెల్యేలకు సీటు ఇవ్వలేదు. ఇతర స్థానాల్లో కేవలం నియోజకవర్గాల మార్పిడికి పరిమితమవుతున్న జగన్ ఎస్సీ రిజర్వ్ స్థానాల విషయంలో మాత్రం టికెట్ చించేస్తున్నారు. ఇప్పటికే రక్షణనిధికి హ్యాండిచ్చారు. మొండితోక జగన్మోహనరావుకు సీటు ఇవ్వడం లేదని స్పష్టమైంది. కైలే అనిల్ కుమార్ పరిస్థితి సందిగ్ధంగానే ఉంది.

- ఓసీ, బీసీ స్థానాల్లో మాత్రం బదిలీలతో సరి
- ఇప్పటికే రక్షణనిధికి హ్యాండిచ్చిన వైసీపీ
- అదే బాటలో మొండితోక, కైలే అనిల్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా కేవలం విజయవాడ సెంట్రల్ సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు మాత్రమే సీటు నిరాకరించారు. రెండు ఎస్సీ రిజర్వ్ స్థానాల్లో అభ్యర్థులను మార్చేస్తున్నారు. తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధికి టికెట్ నిరాకరించి ఆ స్థానంలో టీడీపీ నుంచి వచ్చిన స్వామిదాసుకు సీటు ఇచ్చారు. నందిగామ నుంచి సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మొండితోక జగన్మోహనరావుకూ ఈసారి టికెట్ ఇవ్వడం లేదని ఇప్పటికే వైసీపీ పెద్దలు స్పష్టం చేశారు. ఆ స్థానం నుంచి వీరులపాడు జెడ్పీటీసీ అమర్లపూడి కీర్తిసౌజన్యకు అవకాశం ఇస్తున్నట్టు సమాచారం. ఈ పరిణామాలు జగన్ మాటల్లో డొల్లతనాన్ని వెల్లడిస్తున్నాయని దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తనకు సీటు నిరాకరించడంపై రక్షణనిధి ఇప్పటికే జగన్‌పై నిప్పులు చెరిగారు. నమ్మించి నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. నందిగామలో పరిస్థితి కాస్త భిన్నం. ఇక్కడ మొండితోక సోదరులిద్దరూ పదవులు అనుభవిస్తున్నారు. దీంతో ఒక సోదరుడికి టికెట్ ఇవ్వలేమని స్పష్టం చేసినా వారి నుంచి పెద్దగా వ్యతిరేకత రాని పరిస్థితి.

కైలే సీటు సందిగ్ధం

కృష్ణా జిల్లాలో ఏకైక ఎస్సీ రిజర్వుడు స్థానమైన పామర్రు అసెంబ్లీ నియోజకవర్గ సిటింగ్ ఎమ్మెల్యే కైలే అనీల్ కుమార్ సీటుపైనా సందిగ్ధత నెలకొంది. ఇప్పటికే నాలుగు జాబితాలు విడుదల చేసినా పామర్రు సీటుపై వైసీపీ పెద్దలు స్పష్టత ఇవ్వడం లేదు. మచిలీపట్నం, పెడన సీట్ల విషయంలో చూపిన దూకుడు ఎస్సీ రిజర్వుడు స్థానం విషయంలో చూపడం లేదు. కృష్ణా జిల్లాలో ఇప్పటి వరకు మచిలీపట్నం నుంచి సిటింగ్ ఎమ్మెల్యే నాని తనయుడు పేర్ని కిట్టుకు, పెడన నుంచి ఉప్పాల రాము, పెనమలూరు నుంచి జోగి రమేశ్‌కు సీటు ఖరారు చేశారు. గుడివాడ నుంచి కొడాలి నాని, గన్నవరం నుంచి వల్లభనేని వంశీకి లైను క్లియర్ అయినట్టే. పెనమలూరు నుంచి బీసీ ఎమ్మెల్యే పార్థసారథి వైసీపీ తరఫున పోటీకి విముఖత చూపి పార్టీకి గుడ్‌బై చెప్పారు. అవనిగడ్డ సీటు విషయంలోనూ సందిగ్ధత నెలకొంది. మొత్తం మీద రెండు నియోజకవర్గాల్లోని ముగ్గురు ఎస్సీ సిటింగ్‌లకూ మొండిచేయి చూపిన ఘనత వైసీపీకి దక్కనుంది.

మచిలీపట్నం ఎంపీ సీటుకు అభ్యర్థి కావలెను

మచిలీపట్నం ఎంపీగా ఉన్న బాలశౌరి పార్టీకి గుడ్‌బై చెప్పడంతో మచిలీపట్నం ఎంపీ స్థానం నుంచి పోటీ చేసే అభ్యర్థి కోసం వైసీపీ వెతుకులాట మొదలు పెట్టింది. మచిలీపట్నంతో సంబంధ బాంధవ్యాలున్న పలువురి వివరాలను పార్టీ పెద్దలు ఇప్పటికే సేకరించి వారితో సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం. మచిలీపట్నం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా చేసిన చలమలశెట్టి వెంకటలక్ష్మి తనయుడైన చలమలశెట్టి సునీల్ పేరును వైసీపీ పెద్దలు పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే సునీల్ తండ్రి తూర్పు గోదావరి జిల్లావాస్తవ్యులు కావడంతో సునీల్ మూడుసార్లు కాకినాడ నుంచి ఎంపీగా పోటీ చేశారు. 2009లో ప్రజారాజ్యం తరఫున, 2014లో వైసీపీ తరఫున 2019లో టీడీపీ తరఫున కాకినాడ ఎంపీగా పోటీ చేశారు. దీంతో ఆయన కాకినాడ నుంచి బరిలోకి దిగేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. మైలవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కూడా ప్రత్యామ్నాయ అభ్యర్థిపై వైసీపీ పెద్దలు దృష్టి పెట్టినట్టు సమాచారం. ప్రస్తుత సిటింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ టీడీపీలోకి వెళుతారన్న ప్రచారం నేపథ్యంలో ఇక్కడ కొత్త అభ్యర్థిని రంగంలోకి దించేందుకు వైసీపీ పెద్దలు సిద్ధమవుతున్నారు.

ధాన్యం రైతు దిగాలు



ధాన్యం బస్తాలు

ఆఫ్‌లైన్‌లోనే ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల వేడుకోలు

జిల్లాలో ధాన్యం రైతు దగాకు గురవుతున్నాడు. పది రోజులుగా ఆఫ్‌లైన్ పద్ధతిలో ధాన్యం కొనుగోలును నిలిపివేయడం.. ఆన్‌లైన్‌లోనే ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించడంతో రైతులకు తిప్పలు మొదలయ్యాయి. మిల్లర్లు మెలికలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆర్‌బీకేల నుంచి ఆన్‌లైన్‌లో వచ్చిన ధాన్యంలో ప్రభుత్వ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యత లేదని, తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామని మిల్లర్లు పేచీ పెడుతున్నారు. ఆర్‌బీకే వద్ద బస్తా రూ.1400 ధరగా నిర్ణయించి పంపితే మిల్లర్లు రూ.1200కు మించి ఇవ్వలేమని చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో బస్తా ధాన్యం రూ.1400 చొప్పున మద్దతు ధర ఇవ్వాలంటే బస్తాకు రూ.200 చొప్పున నగదు చెల్లిస్తే ధాన్యం దించుకుంటామని మిల్లర్లు మొండికేస్తున్నారు. దీంతో మిల్లర్ల వద్దకు వెళ్లి వారు అడిగినంత నగదును చెల్లించాల్సి వస్తోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

- ఇదే విషయాన్ని జేసీకి ఇటీవల తెలియజేసిన రైతులు
- ఆర్బీకేల్లో సూచించన మద్దతు ధరను ఇవ్వబోమంటున్న మిల్లర్లు
- పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌ను కలిసి గోడు వెళ్లబోసుకున్న రైతులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ధాన్యం కొనుగోళ్లలో రైతులు పడుతున్న ఇబ్బందులపై జేసీ గీతాంజలి శర్మ ఇటీవల పామర్రు, పెనమలూరు నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. భారీ వర్షాల కారణంగా ధాన్యం రంగ మారడం, నూకల శాతం అధికంగా ఉండటం, ధాన్యం మొక్క మొలవడం చూశారు. కుప్పనూర్పిళ్లు చేసిన తరువాత ధాన్యాన్ని ఆర్‌బీకేలకు తీసుకువెళితే నాణ్యతను పరిశీలించి మద్దతు ధరను నిర్ణయించి ఆన్‌లైన్‌లో దూరప్రాంతంలోని మిల్లులకు పంపుతున్నారని రైతులు వివరించారు. ఆర్‌బీకేలలో సూచించిన మద్దతు ధరను ఇవ్వలేమని మిల్లర్లు అంటున్నారని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో ధాన్యం విక్రయిస్తే మద్దతు ధర అధికంగా ఇచ్చే మిల్లుకు ధాన్యం విక్రయించుకుంటామని కూడా తెలిపారు. తుఫాను కారణంగా ధాన్యం తడిచిపోయిందని, ఈ ఏడాది ప్రత్యేక పరిస్థితుల్లో ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేసేలా అనుమతులు ఇవ్వాలని రైతులు జేసీకి విన్నవించారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని జేసీ ఈ సందర్భంగా తెలిపారు. జిల్లాలో కుప్పల రూపంలో ఎంత ధాన్యం ఉందో కూడా జియో ట్యాగింగ్ చేయించారు. ఇంత జరిగినా ప్రభుత్వం నుంచి ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలుకు అనుమతులు ఇవ్వడం లేదు.

ఆఫ్‌లైన్‌లో కొనుగోలుకు అనుమతులు వచ్చేనా?

జిల్లాలో గత ఖరీఫ్ సీజన్‌లో 3.74 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. 10.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాగా ఉంది. జిల్లాలోని అన్ని మండలాల్లో రెండో పంటగా మినుము సాగు చేయడంతో అధిక శాతం వరి పంట కుప్పలుగా వేసి ఉంది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ధాన్యం వివరాలు నమోదు చేస్తుండటం, మిల్లర్లు ధాన్యానికి మద్దతు ధర అంత ఇవ్వలేమని చెబుతుండటంతో కుప్పనూర్పిళ్లు చేసేందుకు రైతులు జంకుతున్నారు. తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని కుప్పలుగా వేశామని అధిక రోజులపాటు ధాన్యం కుప్పల్లోనే ఉంటే నాణ్యత మరింతగా దెబ్బతింటుందనే భయం రైతులను వెంటాడుతోంది. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి రైతులతో కలిసి శనివారం పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరు డి.రాజుతో సమావేశమై ఇబ్బందులు వివరించారు. ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేసేలా అనుమతులు ఇవ్వాలని కోరుతూ రైతులు వినతిపత్రం అందజేశారు.

3.25 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం

జిల్లాలో ఇప్పటివరకు 3.25 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. రూ.705 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.632 కోట్లను రైతుల ఖాతాల్లో జమచేశాం. ధాన్యం తడిచి రంగు మారడంతో ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేసేందుకు అనుమతులు వచ్చే అవకాశం ఉంది.

- డి.రాజు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

ఎన్నికల్లో మా తడాఖా చూపిస్తాం

ప్రభుత్వానికి అంగన్వాడీల హెచ్చరిక

40వ రోజుకు చేరిన నిరవధిక దీక్షలు



బందరులో నినాదాలు చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు

మచిలీపట్నం టౌన్, జనవరి 20 : అంగన్వాడీలకు జీతాలు పెంచకపోతే రానున్న ఎన్నికల్లో తమ తడాఖా చూపిస్తారని సీఐటీయూ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షురాలు ఎస్.వరలక్ష్మి హెచ్చరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె శనివారం 40వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా శిబిరంలో అవనిగడ్డ, గుడివాడ, పామర్రు, చల్లపల్లి తదితర ప్రాంతాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు రిలే దీక్షల్లో పాల్గొన్నారు. శిబిరాన్ని అఖిల భారత సీఐటీయూ ఉపాధ్యక్షురాలు ఎస్.వరలక్ష్మి మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్తల జీతాలు పెంచని పక్షంలో సీఎంకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. అంగన్‌వాడీ దీక్షలు మండల దీక్షలను తలపిస్తున్నాయన్నారు. అంగన్వాడీ కార్యకర్తలను అరెస్టు చేస్తామని, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని పీడీ, సీడీపీఓలు బెదిరిస్తున్నారని, ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎస్మా చట్టాలకు, షోకాజ్ నోటీసులకు బెదిరేది లేదన్నారు.

దారికొచ్చేదెప్పుడో!?



విజయవాడ - హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ వేకు తిప్పలు

- దేశంలోనే మొదటి బీవోటీ ప్రాజెక్టు ఇది

- 20 ఏళ్లు గడిచినా మొదలు కాని పనులు
- పనులు చేయని కాంట్రాక్టు సంస్థ జీఎంఆర్
- ఎన్టీఆర్ జిల్లాలో కోదాడ నుంచి నందిగామ వరకు 40 కిలోమీటర్ల దూరం
- ఆ సంస్థను వదిలించుకునేందుకు కేంద్రం వ్యూహాత్మక మౌనం
- ఈ - ప్రాక్యూర్‌మెంట్‌కు టెండర్లు పిలవాలంటే మరో పదేళ్లు ఆగాల్సిందే
- అప్పటి వరకు హైదరాబాద్ మార్గంలో తప్పని ప్రయాణ కష్టాలు

హైదరాబాద్ - విజయవాడ మధ్య ఎన్‌హెచ్ - 65ను ఆరు వరసలుగా విస్తరించే అంశంపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. దేశంలోనే మొట్టమొదటి బీవోటీ ప్రాజెక్టు ఇది. 30 ఏళ్ల కాలానికి బీవోటీ ప్రాతిపదికన ఇచ్చిన ప్రాజెక్టు ఇది. జీఎంఆర్ సంస్థ ఈ బీవోటీని దక్కించుకుంది. నేటికీ ఇది కార్యరూపం దాల్చలేదు. జీఎంఆర్ సంస్థ పనులు చేపట్టకపోవటంతో.. ఈ ప్రాజెక్టుపై చాలా కాలంగా వివాదం నెలకొంది. దాదాపుగా 20 ఏళ్లు కావస్తున్నా ఇప్పటికీ పనులు కార్యరూపం దాల్చలేదు. జీఎంఆర్ సంస్థతో ఢీకొట్టడానికి కేంద్ర ప్రభుత్వం కూడా వెనుకడుగు వేస్తోంది. దీంతో ఈ ప్రాజెక్టుపై ఇప్పటికీ ప్రతిష్టంభన కొనసాగుతోంది.

ఆంధ్రజ్యోతి-విజయవాడ : జాతీయ రహదారులను బీవోటీ (బిల్డ్ ఆపరేట్ అండ్ ట్రాన్సిస్ట్) విధానంలో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, విజయవాడ - హైదరాబాద్ మధ్య 30 ఏళ్ల ప్రాతిపదికన బీవోటీ పద్ధతిన ఇచ్చారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో కోదాడ నుంచి నందిగామ వరకు ఆరు లేన్ల పనులు చేపట్టాల్సి ఉంది. జీఎంఆర్ సంస్థ పనులు చేపట్టకపోవటం వల్ల బీవోటీ ప్రాజెక్టుకు అవరోధం వాటిల్లుతోంది.

వ్యూహాత్మక మౌనంలో కేంద్ర ప్రభుత్వం

జీఎంఆర్ సంస్థతో గతంలో పలుమార్లు చర్చలు జరిపిన క్రమంలో.. ఈ ప్రాజెక్టును రద్దు చేసుకుంటే.. 30 ఏళ్ల కాలానికి టోల్ చార్జీలు కట్టాలన్న షరతు విధించినట్టు అనధికారిక సమాచారం. విజయవాడ - హైదరాబాద్ మార్గంలో రోజుకు ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయో సర్వే నిర్వహించి.. దాని ప్రకారం రోజుకు టోల్ చార్జీలు ఎంత వసూలు చేయవచ్చో సగటును నిర్ణయించి ఏడాదికి సగటున లెక్కించి 30 ఏళ్ల కాలానికి జీఎంఆర్ సంస్థకు కేంద్రం చెల్లించాల్సి ఉంటుంది.

రోడ్డే వేయకుండా బల్క్‌గా డబ్బులు చెల్లించాల్సి రావటం సరైందికాదు. దీంతో ఈ సంస్థతో సంప్రదింపులు చేసే కంటే వదిలేస్తే పోలా అన్నట్టుగా కేంద్రం, ఎన్‌హెచ్ ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారు. దీంతో మరో పదేళ్ల దాకా జీఎంఆర్ సంస్థతో బీవోటీ పీరియడ్ పూర్తయ్యే వరకు కూడా ఈ అంశంపై వ్యూహాత్మక మౌనం పాటించాలని ఎన్‌హెచ్ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

మరో పదేళ్లు ఇదే పరిస్థితి..

విజయవాడ - హైదరాబాద్ మార్గంలో ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ నుంచి జగ్గయ్యపేట, కోదాడ వరకు నాలుగు వరసలుగానే ఉంది. ఎన్‌హెచ్ విస్తరణ జరగాలని మూడు దశాబ్దాల నుంచి డిమాండ్ వస్తుండటంతో.. అప్పట్లో దీని ప్రాధాన్యతను గుర్తించి మొదటి బీఓటీ ప్రాజెక్టుగా టెండర్లు పిలిచారు. తలకెత్తుకున్న మొదటి ప్రాజెక్టుకే దిక్కులేకుండా పోయింది. ఈ ప్రాజెక్టు సాకారమైతే హుజూర్‌నగర్, సూర్యాపేట, కోదాడ, జగ్గయ్యపేట, నందిగామ వరకు జాతీయ రహదారిపై నెలకొన్న ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం లభించేది. సమస్య ఇంకా అపరిష్కృతంగా ఉండటంతో మరో పదేళ్ల పాటు ఇదే పరిస్థితి నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి.

బీవోటీ విధానం అట్టర్ ఫ్లాప్

రోడ్లను బీఓటీ విధానంలో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశ వ్యాప్తంగా అట్టర్ ఫ్లాప్ అయింది. విజయవాడ - హైదరాబాద్ బీవోటీ తర్వాత ఉమ్మడి కృష్ణా జిల్లాలో కూడా మరో రెండు బీవోటీ ప్రాజెక్టులకు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) శ్రీకారం చుట్టింది. కాజ - విజయవాడ - గుండుగొలను రోడ్డు ప్రాజెక్టు రూ.1400 కోట్ల వ్యయంతో బీఓటీ పద్ధతిన గామన్ ఇండియా సంస్థకు అప్పగించింది. విజయవాడ - మచిలీపట్నం రోడ్డు ప్రాజెక్టును కూడా మధుకాన్ సంస్థకు బీవోటీ విధానంలో కట్టబెట్టింది. ఈ రెండు సంస్థలు కూడా పనులు చేపట్టలేదు. ఆర్థిక సమస్యలతో ప్రాజెక్టు పనులు చేపట్టలేదు. దాదాపుగా పదేళ్ల పాటు పనులు జరగలేదు. విజయవాడ - మచిలీపట్నం బీవోటీకి సంబంధించి మధుకాన్ సంస్థకు నోటీసులిచ్చి ఎలాగోలా వదిలించుకున్నారు. కాజ - విజయవాడ - గుండుగొలను రోడ్డు ప్రాజెక్టుకు సంబంధించి మాత్రం దిలీప్ బిల్డ్‌కాన్‌ను వదిలించుకోవటానికి ఎన్‌హెచ్ అధికారుల ఎన్నో కష్టాలు పడాల్సి వచ్చింది. ఆ సంస్థకు నోటీసుల మీద నోటీసులు ఇచ్చిన తర్వాత దాంతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేశారు. దీనిపై ఆ సంస్థ కోర్టుకు వెళ్లింది. కోర్టులో మరో ఏడాది సమయం పట్టింది. చివరికి జాతీయ రహదారుల సంస్థకు అనుకూలంగా తీర్పు రావటంతో.. ఆ సంస్థతో ఒప్పందాన్ని రద్దు చేసుకున్నారు. ఆ తర్వాత రెండు ప్రాజెక్టులకు ఈపీసీ విధానంలో టెండర్లు పిలిచారు. ఈ రెండు సంస్థల నిర్వాకం వల్ల రెండు ప్రాజెక్టుల మీద కలిపి కేంద్ర ప్రభుత్వం మీద రూ.6వేల కోట్ల భారం పడింది. ఇవన్నీ చూస్తుంటే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన బీవోటీ ప్రాజెక్టులు ఎంతగా విఫలం చెందాయో అర్థమవుతాయి. దేశంలోనే మొదటి బీఓటీ ప్రాజెక్టు అయిన విజయవాడ - హైదరాబాద్ ప్రాజెక్టు పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. విజయవాడ - హైదరాబాద్ మార్గంలో బీవోటీ ప్రాజెక్టును వదులుకుందామన్న ఆలోచన ఉన్నా.. జీఎంఆర్ సంస్థ కేసు వేస్తే మొదటికే మోసం వస్తుందన్న ఆలోచనతో ఎన్‌హెచ్ అధికారులు ఆత్మరక్షణ ధోరణితో వ్యవహరిస్తున్నారు. మరో పదేళ్లు కూడా ఆరు వరసలు అభివృద్ధి చేయకపోతే ట్రాఫిక్ సమస్యలతో ప్రయాణికులు విలవిల్లాడే పరిస్థితి ఉంది.



ఉయ్యూరు ఆర్డీవో రాజుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆన్‌లైన్‌లో ధాన్యం కొనుగోలుతో రైతులకు ఇక్కట్లు

- ఆఫ్‌లైన్ విధానాన్ని అమలు చేయాలి
- ఆర్డీవోకు ఎమ్మెల్యే కేపీ సారథి వినతి
- సమస్యలు పరిష్కరించకుంటే ఆందోనకు దిగుతామని హెచ్చరిక

ఉయ్యూరు, జనవరి 20: ధాన్యం ఆన్‌లైన్ కొనుగోలు విధానంతో రైతులు అసౌకర్యానికి, దోపిడీకి గురవుతున్నారని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థ సారథి అన్నారు. ధాన్యం కొనుగోలుకు ఆఫ్‌లైన్ విధానం అమలుచేసి రైతులను ఆదుకోవాలని రైతులు, వైసీపీ నాయకులతో కలిసి శనివారం ఉయ్యూరు ఆర్డీవో రాజుకు ఆయన వినతిపత్రం అందించారు. ఆన్‌లైన్ విధానం వల్ల రైస్‌మిల్లర్లు ఆర్బీకే నిర్ధారించిన ధరకంటే రూ.300 నుంచి 400 వరకు తగ్గించి రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. దగ్గరలో ఉన్న మిల్లులకు కాకుండా దూర ప్రాంత మిల్లులకు ధాన్యం తోలడంతో దిగుమతి సమయంలో ఇబ్బందులు పడుతున్నారని, లారీలు, ట్రాక్టర్ల నుంచి ధాన్యం రెండు మూడు రోజులకు దిగుమతి కావడం లేదని తెలిపారు. ఎఫ్‌సీఐ, నాన్ సార్టెక్స్ నిబంధనల ప్రకారం 25 శాతం నూకలు తీసుకోవటానికి అనుమతులున్నా రాష్ట్ర ప్రభుత్వం 15 శాతమే అనుమతిస్తోందన్నారు. 15 శాతం నూకలు దాటితే మిల్లర్లు ధర తగ్గిస్తున్నారని దీంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. రైతులకు మేలు కలిగేలా 25 శాతం నూకల వరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మిల్లులకు ధాన్యం కేటాయింపులో అవినీతి జరుగుతోందన్నారు. చిన్న రైస్‌మిల్లులకు కాకుండా రాజకీయ నాయకుల ఒత్తిడితో చిత్తూరు, కడప జిల్లాలో వారికి కావలసిన మిల్లులకు ధాన్యం కేటాయిస్తున్నారన్న ఆరోపణలున్నాయన్నారు. దెబ్బతిన్న ధాన్యాన్ని మార్కెట్ యార్డుల ద్వారా గత ప్రభుత్వం ఎంఎస్‌పీ కంటే రూ.100 తగ్గించి పూర్తిగా కొనుగోలు చేసిందని ప్రస్తుత ప్రభుత్వం కూడా అలా కొనుగోలు చేసి రైతులకు మేలు చేయాలని కోరారు. ధాన్యం తోలిన రైతులకు వారి ఖాతాల్లో నగదు వెంటనే జమచేయాలని, జిల్లాలోని చిన్న, మధ్యతరగతి, పెద్ద రైస్‌మిల్లులకు దామాషా ప్రకారం ధాన్యం కేటాయించాలని, తుపాను కారణంగా మినుము ఆలస్యంగా వేయడంవల్ల కుప్పలు నూర్పడం ఆలస్యం అవుతుందని మార్చి నెల తరువాత కూడా నూర్చే ధాన్యాన్నీ కొనాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

రైతుల ఇబ్బందులు పట్టని మంత్రులు

క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులు మంత్రులకు పట్టడం లేదని కేపీ సారథి ఆరోపించారు. రైతుల ఇబ్బందులపై ఏ మంత్రీ సమీక్ష చేయడం లేదన్నారు. రాజకీయాలు, ప్రతిపక్షాలను విమర్శించడం కాకుండా ధాన్యం కొనుగోలు ప్రస్తుత పరిస్థితిపై సమీక్షచేయాలన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే రైతుల తరఫున ఆందోళన చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన హెచ్చరించారు. ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ, పలువురు కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు సారథి వెంట ఉన్నారు.

ఆర్బీకేలు, మిల్లుల్లో ధాన్యం ధరలో వ్యత్యాసం

- పౌర సరఫరాల కృష్ణాజిల్లా మేనేజర్‌కు లంకపల్లి రైతుల ఫిర్యాదు



పౌర సరఫరాల జిల్లా మేనేజర్ డి.రాజుకు సమస్యలు వివరిస్తున్న రైతులు

మచిలీపట్నం టౌన్, జనవరి 20: ఆర్బీకేల్లో నిర్ణయించిన ధాన్యం ధరకు, మిల్లులు తీసుకుంటున్న ధరకు వ్యత్యాసం ఉంటోందని పౌర సరఫరాల కృష్ణాజిల్లా డి.రాజుకు పమిడిముక్కల మండలం లంకపల్లి, ఆలీనబీ పాలెం రైతులు శనివారం ఫిర్యాదు చేశారు. ఖుషీద్ ఆలీ, వేమూరి శ్రీనివాసరావులు మచిలీపట్నంలోని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను వివరించారు. వర్షం కారణంగా రంగు మారిన ధాన్యానికి ధరలో ఆర్బీకేలకు, నిడుమోలు రైసుమిల్లర్లకు మధ్య వ్యత్యాసం ఉంటుందన్నారు. రైసుమిల్లర్లు ఆర్బీకేల్లో నిర్ణయించిన రేటు కన్నా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ సమస్యపై పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాజు రైతులతో మాట్లాడారు. మొబైల్ టీములతో మళ్లీ ధాన్యానికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించి ధర నిర్ణయిస్తామన్నారు. తక్కువ ధరకు తీసుకుంటే మిల్లర్లపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ వేయలేని ప్రభుత్వమిది

గవర్నర్‌పేట, జనవరి 20: ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ఒక్క డీఎస్సీ కూడా నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులను మోసం చేసిందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్టీఆర్ జిల్లా యూటీఎఫ్ కార్యవర్గ సమావేశం శనివారం ఎంజీ రోడ్డులోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడారు. విద్యారంగానికి భారీగా నిధులు కేటాయిస్తున్నామని ప్రచారం చేస్తున్నా ప్రభుత్వం నాడు-నేడు కింద భవనాలు నిర్మించి, అమ్మ ఒడికి నిధులిస్తే సరిపోదన్నారు. తరగతి గదుల్లో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు లేకపోతే నిధులు దుర్వినియోగం అవుతాయని విద్యారంగానికి, పేదలు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలలకు ఉపయోగం లేదన్నారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలు రూ.20 వేల కోట్లు కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళనలు చేయడం ఏ ప్రభుత్వంలోనూ చూడలేదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. ఉద్యోగుల ఆందోళనలు, ఆక్రందనలు అర్థం చేసుకోకుంటే మూడు నెలల్లో ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. మున్సిపల్ టీచర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఈనెల 25 నుంచి భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య, జిల్లా కోశాధికారి పి.నాగేశ్వరరావు, జిల్లా సహాధ్యక్షుడు ఎం.కృష్ణయ్య, డి.అపర్ణ, కార్యవర్గ సభ్యులు ప్రసంగించారు.

మర్యాదపూర్వకంగా..

- లోకేశ్‌ను కలిసిన బుద్దా వెంకన్న



లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బుద్దా వెంకన్న

వన్‌టౌన్, జనవరి 20: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో టీడీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరూ సమకాలీన రాజకీయాలపై అరగంటకు పైగా చర్చించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహంపై ఇద్దరూ మాట్లాడుకున్నారు. వెంకన్నతో పాటు ఆయన అల్లుడు కాండ్రేగుల రవీంద్ర లోకేశ్‌ను కలిశారు.

కృష్ణాజిల్లాలో అన్ని సీట్లూ టీడీపీ-జనసేన కైవసం

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్

మచిలీపట్నం టౌన్, జనవరి 20: టీడీపీ-జనసేన కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికల్లో కృష్ణాజిల్లాలోని అన్ని సీట్లనూ కూటమి కైవసం చేసుకుంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గుడివాడలో నిర్వహించిన రా..కదలిరా సభ విజయవంతం కావడంతో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. అవినీతి అక్రమాల ఊబిలో కూరుకుపోయిన వైసీపీ ఎమ్మెల్యేలు పార్టీని వదిలిపెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అక్రమార్కులైన సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ స్థానాల్లో పోటీ చేసే పరిస్థితి లేదన్నారు.





అంగన్వాడీలకు మద్దతుగా మచిలీపట్నం రేవతీ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విజయవాడ లెనిన్‌సెంటర్‌లో ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నేతలు

వేతనాలు పెంచాల్సిందే

అంగన్వాడీల దీక్షలకు మద్దతుగా కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల రాస్తారోకో

ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మచిలీపట్నం టౌన్, జనవరి 20: తమ న్యాయమైన డిమాండ్లు ఆమోదించాలని నిరవధిక సమ్మె, రిలే దీక్షలు చేస్తున్న అంగన్వాడీలకు మద్దతుగా శనివారం మచిలీపట్నం రేవతీ టాకీసు సెంటర్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు రాస్తారోకో చేశారు. వేతనాలు పెంచాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకోలో సీపీఎం నాయకుడు కొడాలి శర్మ, సీపీఐ నాయకుడు మోదుమూడి రామారావు, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, సీఐటీయూ నాయకుడు బి.సుబ్రహ్మణ్యం, ఏఐటీయూసీ నాయకుడు లింగం ఫిలిప్, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ మతీన్, ఎన్.కుమారి, వివిధ కార్మిక సంఘాల నాయకులు రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు, ఆందోళనకారులకు మధ్య తోపులాట జరిగింది. ఆందోళనకారులను పోలీసులు చెల్లాచెదురు చేశారు. కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది.





మచిలీపట్నంలో ఆందోళనకారులను లాగిపడేస్తున్న పోలీసులు
లెనిన్‌సెంటర్‌లో వ్యానులో తరలిస్తున్న పోలీసులు

సామాజిక న్యాయం అమలంటూ జగన్ ప్రగల్భాలు

గవర్నర్‌పేట: "డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రారంభ కార్యక్రమం సభలో సామాజిక న్యాయం అమలు చేస్తున్నట్లు సీఎం జగన్ ప్రగల్భాలు పలికారు. అంగన్వాడీల్లో 90 శాతం మంది బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలకు చెందిన వారే ఉన్నారు. లక్షకుపైగా ఉన్న అంగన్వాడీలను 40 రోజులుగా సమ్మె చేస్తున్నా వారి న్యాయమైన డిమాండ్లు జగన్ ఎందుకు ఆమోదించలేదు. పెత్తందార్లు, పేదలకు మధ్య పోరాటం, సామాజిక న్యాయం అంటూ జగన్ మాట్లాడటం హాస్యాస్పదం." అని ఏఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ చెబుతున్న సామాజిక న్యాయం మాటలు అసత్యాలేనని దీని ద్వారా నిరూపితమైందన్నారు. అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం లెనిన్ సెంటర్‌లో ఆందోళన చేశారు. వేతనాలు పెంచుతూ ప్రభుత్వం తక్షణమే జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు సీహెచ్ శ్రీనివాసరావు ప్రసంగించారు. ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నేతలు ఓబులేసు, శ్రీనివాసరావు, ప్రసాద్, రవీంద్రనాథ్, కె.పోలారి, ఎ.రవిచంద్ర, వెంకటసుబ్బయ్య, నారాయణ, కె.దుర్గ, పి.పద్మ, జె.లలిత, ఐ.రాజేష్‌ను పోలీసులు అరెస్టు చేసి హనుమాన్‌పేటలోని రాజేశ్వరీ కల్యాణ మంటపానికి తరలించారు.

ఇసుక రీచ్‌లలో అనధికార వసూళ్లు

రోడ్డు నిర్వహణ పేరుతో ట్రాక్టరుకు రూ.500, మినీ లారీకి రూ.వెయ్యి, లారీ, టిప్పరుకు రూ.1500 వసూలు

- కాంట్రాక్టర్ల తీరుపై వాహనాల యజమానుల ఆగ్రహం
- చెవిటికల్లు రీచ్‌లో రెండు గంటల సేపు ధర్నా

కంచికచర్ల: నందిగామ డివిజన్‌లోని ఇసుక రీచ్‌లలో అనధికారికంగా బలవంతపు వసూళ్లకు తెరలేచింది. ఒక్కో వాహనం నుంచి రూ. ఐదు వందలు నుంచి రూ. 15 వందల వరకు వసూలు చేస్తున్నారు. వసూలు చేస్తున్న సొమ్ముకు సిబ్బంది ఎలాంటి రశీదు ఇవ్వటం లేదు. ఈ సొమ్ము చెల్లించని వాహనాలకు రీచ్‌లలో ఇసుక లోడ్ చేయటం లేదు. రీచ్‌లలో రోడ్డు నిర్వహణ పేరుతో కాంట్రాక్టర్లు బలవంతంగా సొమ్ము వసూలు చేస్తుండటంపై వాహనాల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నందిగామ మైనింగ్ డివిజన్ పరిధిలోని కృష్ణానదిపై కంచికచర్ల మండలం చెవిటికల్లు, మున్నలూరు, చందర్లపాడు మండలం కాసరబాద, మునేటిపై నందిగామ మండలం కంచెల, వత్సవాయి మండలం కన్నెవీడు రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రీచ్‌లలో టన్నుకు రూ.475 తీసుకోవాలి. ఇతరత్రా ఎలాంటి రుసుం వసూలు చేయకూడదు. కానీ మూడు రోజుల నుంచి రీచ్‌లలో వాహనాల నుంచి బలవంతంగా సొమ్ములు వసూలు చేస్తున్నారు. ట్రాక్టరుకు రూ.ఐదు వందలు, మినీ లారీకి రూ.వెయ్యి లారీ, టిప్పరుకు రూ.15 వందలు వసూలు చేస్తున్నారు. ఇసుక ధర, లోడ్(టన్నేజీ) వివరాలు వేబిల్లులో పేర్కొంటున్నారు. అయితే బలవంతంగా వసూలు చేస్తున్న సొమ్ముకు రశీదు ఇవ్వడం లేదు. అదనంగా సొమ్ము ఎందుకు వసూలు చేస్తున్నారని వాహనాల యజమానులు అడిగితే రీచ్‌లలో రోడ్డు నిర్వహణ కోసమని రీచ్‌ల వద్ద ఉంటున్న కాంట్రాక్టర్ల సిబ్బంది చెబుతున్నారు. అదనపు సొమ్ము చెల్లించిన వాహనాలకే ఇసుక లోడ్ చేస్తున్నారు. చేయకపోతే లోడ్ చేయటం లేదు. రీచ్‌లలో బాట(రోడ్డు) నిర్వహణ (మెయింటెనెన్స్) పేరుతో బలవంతంగా వసూలు చేయడంపై శనివారం చెవిటికల్లు రీచ్ వద్ద పలువురు వాహనాల యజమానులు ఆందోళనకు దిగారు. బలవంతపు వసూళ్లకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దాదాపుగా రెండు గంటలు ధర్నా చేశారు. రీచ్‌లలో అనధికారికంగా సొమ్ము వసూలు చేయటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు బాట పేరతో దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇసుక ధర పెంచితే కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్నారని, కిరాయి కూడా గిట్టుబాటు కావడం లేదని వాహనదారులు వాపోయారు. అక్రమాలకు, దోపిడీకి తావులేకుండా ఇసుక రీచ్‌లలో అంతా పారదర్శకమని గొప్పలు చెప్పుకోవడం కాదు.. ప్రస్తుతం రీచ్‌లలో బహిరంగంగా జరుగుతున్న దోపిడీని అరికట్టాలని వాహనాల యజమానులు, కొనుగోలుదారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మా భూముల్లో ఇసుక తవ్వొద్దు

- ప్రభుత్వ జీవోను అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా ఇసుక దోపిడీ చేస్తున్నారు
- రొయ్యూరులో క్వారీ నిర్వాహకులకు ఎదురుతిరిగిన ఎస్సీ సొసైటీ రైతులు
- ఇసుక లారీల నిలిపివేత



రొయ్యూరు క్వారీలో ఇసుక లారీలను అడ్డుకున్న ఎస్సీ సొసైటీ రైతులు

తోట్లవల్లూరు: మండలంలోని రొయ్యూరు క్వారీలో అడ్డగోలు ఇసుక దోపిడీని ఎస్సీ సొసైటీ రైతులు శనివారం అడ్డుకున్నారు. ప్రభుత్వం జీవో ఇచ్చిందని అడ్డగోలుగా తమ సొసైటీ భూముల్లో దారివేసి ఎలా ఇసుక దోపిడీ చేస్తారని నిర్వాహకులకు రైతులు ఎదురు తిరిగారు. దీంతో ఇసుక లారీలు నిలిచిపోయాయి. ఈ నెల 12వ తేదీన ఇసుక తవ్వకాలు మొదలు పెట్టగా ఎలాంటి అనుమతులు లేవని, తవ్వకాలను నిలిపివేయాలని తహసీల్దార్ ఎం కుసుమకుమారి సూచించినా నిర్వాహకులు వెనక్కి తగ్గలేదు. ఎక్కడకు వెళుతుందో తెలియకుండా విచ్చిలవిడిగా తవ్వకాలు జోరందుకోవటంతో ఎస్సీ సొసైటీ ప్రతినిధి పులి ప్రసాద్ నేతృత్వంలో రైతులు ముందుకువచ్చి ఇసుక తవ్వకాలను అడ్డుకున్నారు. ఇసుక లారీల యజమానులు క్వారీ వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకుని తహసీల్దార్ కుసుమకుమారి క్వారీ వద్దకు వచ్చారు. ఎస్సై విశ్వనాథ్‌ను పిలిపించారు. ఇసుక లారీలను కార్యాలయానికి తీసుకెళతామని తహసీల్దార్ చెప్పటంతో లారీల యజమానులు అంగీకరించలేదు. ఇసుక క్వారీ తెరిచామంటే తమ లారీలను పంపామని, ఇసుక తవ్వేవారికి జరిమానాలు వేయకుండా లారీలకు ఎలా వేస్తారంటూ ప్రశ్నించారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత ఏర్పడింది. లారీలను తీసుకురాలేకపోయారు. ఇసుక తవ్వవద్దని సిబ్బందికి తహసీల్దార్ సూచించారు. అధికారపార్టీ పెద్దల అండదండలతోనే జిల్లాకు ఇచ్చిన జీవోను అడ్డుపెట్టుకుని నిర్వాహకులు అడ్డగోలు తవ్వకాలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

అంబేడ్కర్‌కు తొలివినతి

- భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా వినతిపత్రం అందించిన న్యాయవాదులు



స్వరాజ్యమైదానంలోని అంబేడ్కర్ స్మృతివనం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా తొలి వినతిని అందిస్తున్న బెజవాడ బార్ న్యాయవాదులు

విజయవాడ లీగల్, జనవరి 20: స్వరాజ్యమైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహానికి శనివారం బెజవాడ బార్ న్యాయవాదులు భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా తొలి వినతిని అందించారు. ఈ సందర్భంగా బెజవాడ బార్ మాజీ ప్రధాన కార్యదర్శి గంధం శ్రీనివాస్ మాట్లాడారు. నెలరోజులకు పైగా బెజవాడ బార్ న్యాయవాదులు సిటీ సివిల్ కోర్టుల ఆవరణలో భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా నిరసన దీక్షలు చేస్తున్నప్పటికీ ఈ ప్రభుత్వానికి చలనం లేదన్నారు. ప్రజలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను హరించేందుకే ప్రభుత్వం భూ హక్కు చట్టాన్ని తెచ్చిందని, అందుకే భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం వద్దకు వచ్చి తమ నిరసనను తెలియజేసి తొలి వినతిని అందిచామని గంధం శ్రీనివాస్ తెలిపారు. న్యాయవాదులు పుప్పాల శ్రీనివాస్, నామాల కోటేశ్వరరావు, మట్టా జయకర్, గిరిప్రసాద్, సోము కృష్ణమూర్తి, ఎఎస్ఎస్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత

సీఎం జగన్‌కు ఉందా?

- టీడీపీ పెడన ఇన్‌చార్జ్ కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి, జనవరి 20: అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాలరాసి, రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న సీఎం జగన్‌కు అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత ఉందా అని టీడీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాగిత కృష్ణప్రసాద్ ప్రశ్నించారు. శనివారం బంటుమిల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం దళితులను మోసం చేసిందని, అక్రమ కేసులు పెట్టి వేధించిందని ఆరోపించారు. నా ఎస్సీలు, ఎస్టీలు అంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఓ పక్క ఊదరగొడుతుంటే, మరోపక్క దళితులపై దాడులు, దళిత మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా యన్నారు. రాజ్యాంగ బద్ధంగా అమల వ్వాల్సిన సంక్షేమ పథకాలను రద్దు చేసి, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ నిధులను దుర్వినియోగం చేశారన్నారు. కోడి కత్తి డ్రామాలో దళితబిడ్డ శ్రీనివాస్‌పై జగన్ అవలంబిస్తున్న తీరు అమానుషమన్నారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని వైసీపీ ఎమ్మెల్సీ అనంత బాబు హతమార్చినప్పుడు దళితులు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కరోనా సమయంలో కిట్లు అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను అవమానించి మానసిక వేధింపులకు గురిచేసి చనిపోవడానికి కారణమైంది ఎవరని కాగిత నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో దళితులు వైసీపీకి బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

కోవర్ట్ కేశినేని నానీని అగౌరవపరచిన జగన్

- ఎక్స్(ట్విట్టర్)లో బుద్దా వెంకన్న

వన్‌టౌన్, జనవరి 20 : విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) ఒక కోవర్ట్ అని టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న ఎక్స్(ట్విట్టర్)లో విమర్శించారు. శనివారం ఆయన ట్విటర్‌లో ఓ పోస్ట్ చేశారు. ఆనాడు కేశినేని నాని కోవర్ట్ అని తెలియక చంద్రబాబునాయుడు గౌరవంగా చూశారన్నారు. ఈ సందర్భంగా ఆనాడు చంద్రబాబు నాయుడు కేశినేని నాని పట్ల చూపిన మర్యాద, తాజాగా జగన్మోహనరెడ్డి అతనిపట్ల చూపించిన మర్యాద వ్యత్యాసాలను తెలిపే వీడియోలను పోస్ట్‌చేశారు. కోవర్ట్ అని తెలిసే జగన్‌రెడ్డి అతనిపట్ల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సమయంలో అగౌరవంగా వ్యవహరించారని బుద్దా పేర్కొన్నారు.



నందిగామలో ఆందోళనాకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఆందోళన ఉద్రిక్తం

నందిగామ: అంగన్వాడీల ఆందోళనలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. అంగన్వాడీలు శనివారం జాతీయ రహదారిపై రాస్తారోకోకు పిలుపునిచ్చారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఉదయం నుంచి అంగన్వాడీల కదలికలపై నిఘా పెట్టారు. గాంధీ సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరిన అంగన్వాడీలను అడ్డుకున్నారు. ఈ దశలో వారి మధ్య తోపులాట జరిగింది. పోలీసులు వలయాన్ని ఛేదించుకుని కొందరు అంగన్వాడీలు వై జంక్షన్ వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. శాంతియుత ఉద్యమం చేస్తున్నామని, తమనెందుకు అడ్డుకుంటున్నారని పోలీసులను అంగన్వాడీలు ప్రశ్నించారు. వామపక్షాల నాయకులు కటారపు గోపాల్, చుండూరు వెంకట సుబ్బారావు మద్దతు తెలిపారు. అనంతరం జాతీయ రహదారిపై మోకాళ్లపై బైఠాయించి అంగన్వాడీలు నిరసన తెలిపారు.

మా టీచరుకు జీతం పెంచండి..



బందరులో శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న చిన్నారి షైనా

మచిలీపట్నంటౌన్: "మా టీచరు బడికి వచ్చి నలభై రోజులైంది. ఆమెకు జీతం పెంచండి.. బడికి పంపండి సీఎం గారూ అంటూ మొవ్వ అంగన్వాడీ కేంద్రానికి చెందిన ఐదేళ్ల చిన్నారి షైనా మైక్‌లో ముఖ్యమంత్రి జగన్‌కు విజ్ఞప్తి చేసింది. అంగన్వాడీల జీతాలు పెంచాలని చిన్నారి నినాదాలు చేస్తుంటే ఆమెతో పాటు ఆందోళనకారులు గొంతు కలిపారు.

సైడ్ డ్రెయిన్‌లో పడి

బాలుడి మృతి



ఏసుపాదం (ఫైల్)

పాయకాపురం, జనవరి 20: మూడేళ్ల బాలుడు సైడ్ డ్రెయిన్‌లో పడి మృతి చెందిన ఘటన పాయకాపురం సుందరయ్యనగర్ ప్రాంతంలో శనివారం జరిగింది. అప్పటి వరకు ఆడుతూ పాడుతూ తిరిగిన బాలుడు విగతజీవిగా కనిపించడంతో బాలుడి కుటుంబం కన్నీరు మున్నీరైంది. సుందరయ్యనగర్ ప్రాంతానికి చెందిన మల్లయ్య, భవానీ దంపతులు కూలి పనులకు వెళ్తుంటారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు. భార్య, భర్తలు పనులకు వెళ్లినప్పుడు ఇంట్లో ఉన్న నాయనమ్మకు పిల్లలను అప్పగిస్తారు. శనివారం పిల్లలిద్దరినీ నాయనమ్మ అంకమ్మకు అప్పగించి వెళ్లారు. రెండో సంతానం ఏసుపాదం(3) ఉదయం ఆరుబయట ఆడుకుంటున్నాడు. అంకమ్మ ఇంటి పనుల్లో నిమగ్నమైంది. ఉదయం 11.30 గంటల సమయంలో నాయనమ్మ బయటకు వచ్చి చూడగా బాలుడు కనిపించలేదు. దీంతో ఆమె మల్లయ్యకు ఫోన్ చేసి ఏసుపాదం కనిపించడం లేదని చెప్పింది. కంగారుగా పని నుంచి ఇంటికి వచ్చిన మల్లయ్య ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు బాలుడి ఆచూకీ కోసం వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో బాలుడి ఇంటి సమీపంలోని సైడ్ డ్రెయిన్‌లో బాలుడి మృతదేహాన్ని గుర్తించారు. రోడ్డుపైకి ఆడుకుంటూ వచ్చిన బాలుడు ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయి మృతి చెందాడని తెలుస్తోంది. తండ్రి ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేలవంగా కేశినేని నాని పర్యటన

కంచికచర్ల రూరల్, నవంబరు 20: టీడీపీలో ఉన్నప్పుడు ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) పర్యటనలకు దక్కిన ఘన స్వాగతం వైసీపీలో చేరాక కనిపించడం లేదు. శనివారం అభివృద్ధి పనుల శంకుస్థాపనకు పెండ్యాల గ్రామానికి ఆయన వచ్చారు. పర్యటన ఆద్యంతమూ పేలవంగా సాగింది. తొలుత పరిటాల నుంచి పెండ్యాల వరకు భారీ మోటర్ బైక్ ర్యాలీ ఉంటుందని వైసీపీ ప్రకటించినా పెద్దగా స్పందన లేకపోవడంతో కీసర నుంచి పెండ్యాల వరకు మాత్రమే ర్యాలీ చేశారు. శుక్రవారం కేశినేని శివనాథ్(చిన్ని) కంచికచర్ల టీడీపీ మండల నాయకులతో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశానికి విశేష స్పందన వచ్చింది. పార్టీ శ్రేణులు చిన్ని వెంట రావడం, మరుసటి రోజు నాని పెండ్యాలలో నిర్వహించిన కార్యక్రమం పేలవంగా సాగడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యింది. టీడీపీని వీడిన నాని వెంట పార్టీలో ఉన్నవారు ఎవ్వరూ వెళ్లి వైసీపీలో చేరకపోవడంతో నానీకి ఈగతి పట్టిందని, పైగా చంద్రబాబు, లోకేశ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, టీడీపీ 60శాతం నుంచి 100 శాతం ఖాళీ అవుతుందని చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలు కూడా ఇందుకు కారణమని పలువురు బహిరంగంగానే చెబుతున్నారు.

ఈవో హేమలతాదేవిపై

శాఖాపరమైన విచారణ

వన్‌టౌన్, జనవరి 20: భ్రమరాంబ మల్లేశ్వరాలయం(పాతశివాలయం) మాజీ ఈవో, ప్రస్తుతం వేదాద్రి ఈవోగా నియామకమైన హేమలతాదేవిపై వచ్చిన ఆరోపణలపై దేవదాయశాఖ విచారణ చేపట్టింది. దేవదాయశాఖ జాయింట్ కమిషనర్(ఎస్టేట్స్) భ్రమరాంబ శనివారం పాతశివాలయంలో హేమలతాదేవిని విచారణ జరిపారు. పాతశివాలయంలో పనిచేసినప్పుడు ఆమెపై పలు ఆరోపణలు వచ్చాయి. హేమలత అవినీతి, అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో దేవదాయశాఖ ప్రాథమిక విచారణ జరిపి హేమలతాదేవిని సస్పెండ్ చేసింది. ఆమె పెట్టుకున్న దరఖాస్తు మేరకు ఇటీవల సస్పెన్షన్‌ను ఎత్తివేసి పోస్టింగ్ ఇచ్చారు. తాజాగా ఆమెపై వచ్చిన ఆరోపణలను విచారించి చర్యలు తీసుకునేందుకు విచారణాధికారిణిగా భ్రమరాంబను నియమించారు. ఇంతకుముందే దేవదాయశాఖ డీసీ, ఏసీలు ఇచ్చిన నివేదిక మేరకు భ్రమరాంబ విచారణ జరిపారు. రికార్డులు పరిశీలించి, విచారణ నిమిత్తం అవసరమైన రికార్డుల నకళ్లను తీసుకున్నారు. అర్చకులను కూడా భ్రమరాంబ విచారణ జరిపారు. హేమలతాదేవికి ఏ విధంగా పోస్టింగ్ వచ్చింది? నియామక పత్రాలు, ఇతరత్రా అంశాలపై ఆమె ఆరాతీశారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	208
చికెన్ స్కిన్‌లెస్	218



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.42

యువతలో దేశభక్తి పెంపొందించాలి

ఉయ్యూరు, జనవరి 20 : యువతలో దేశభక్తి కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రేరణ కల్పించాలని ఉయ్యూరు పట్టణ ఎస్సై పి. వాసు అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రిపబ్లిక్‌డే సందర్భంగా జయహో భారత్ పేరిట విద్యార్థులకు వివిధ అంశాల్లో నిర్వహించనున్న పోటీలకు సంబంధించిన జయహో భారత్ కార్యక్రమ పోస్టర్‌ను శనివారం ఎస్సై ఆవిష్కరించారు. క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, కార్యదర్శి నల్లా శ్రీనివాస్, ట్రెజరర్ వూర కిషోర్ కుమార్, సభ్యులు దినవహి ప్రసాద్, అబ్దుల్ హాసన్ పాల్గొన్నారు.

జగన్ మొండివైఖరి వీడాలి

● అంగన్వాడీలకు మద్దతుగా గన్నవరం, ఉయ్యూరులో ప్రజాసంఘాల రాస్తారోకో

గన్నవరం, జనవరి 20 : ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ 40 రోజులుగా శాంతి యుతంగా ధర్నా చేస్తున్న అంగన్వాడీల పట్ల జగన్ మొండివైఖరి వీడాలని సీఐటీయూ జిల్లా మాజీ కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గన్నవరంలో శనివారం నిరసన ప్రదర్శన చేసి గాంధీబొమ్మ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ, అంగన్వాడీల పట్ల ప్రభుత్వ మొండివైఖరి వీడకపోతే పుట్టగతులుండవన్నారు. రాష్ట్రంలో లక్షా ఆరు వేల మంది అంగన్వాడీల కుటుంబాలు ఉన్నాయని వారి ఆక్రోశానికి జగన్‌రెడ్డి బలికాక తప్పదని హెచ్చరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి ఎస్మా ప్రయోగించటం దుర్మార్గమన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉండి పాదయాత్ర చేస్తూ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక మరిచిపోవటం బాధాకరమన్నారు. రాస్తారోకో చేస్తున్న నాయకులను సీఐ కనకారావు ఆధ్వర్యంలో బలవంతంగా రోడ్డుపై ఈడ్చి వేశారు. నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. నాయకులు బేతా శ్రీనివాసరావు, అజ్మీర వెంకటేశ్వరరావు, నల్లి ఆంజనేయులు, మల్లంపల్లి ఆంజనేయులు, కళ్లం వెంకటేశ్వరరావు, మల్లంపల్లి జయమ్మ, వై.నాగలక్ష్మి, బత్తుల శ్రీనివాస రెడ్డి, నాగేశ్వరరావు, పఠాన్ సర్దార్ పాల్గొన్నారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు : అంగన్వాడీలకు తెలంగాణా రాష్ట్రం కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ జీతం ఇస్తానని వాగ్దానం చేసిన జగన్మోహన రెడ్డి అధికారంలోకి వచ్చాక మాట తప్పి మడం తిప్పారని కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కోసూరి శివనాగేంద్రం ఆరోపించారు. న్యాయమైన హక్కుల సాధనకు 40 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ వర్కర్లకు మద్దతుగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఉయ్యూరు సెంటర్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, న్యాయమైన హక్కుల కోసం అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే రాష్ట్రప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతూ అణచివేత ధోరణి అవలంబిస్తుందన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి జ్యోతి, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, సీఐటీయూ నాయకులు రాజేశ్, గంగాధరరావు, నరేశ్, అన్నే సుబ్బారావు, కార్మిక సంఘ నాయకులు ప్రకాశ్‌రావు, కీర్తి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





గన్నవరంలో రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు, ఉయ్యూరులో రాస్తారోకో

రానున్న ఎన్నికల్లో అంగన్వాడీల సత్తా చాటుతాం..

కంకిపాడు : అంగన్వాడీలు 40 రోజులుగా సమ్మె చేస్తుంటే సీఎం జగన్‌మోహన్ రెడ్డికి కనిపించకపోవడం దురదృష్టకరమని, రానున్న ఎన్నికల్లో తమ సత్తా చాటుతాం అని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆల్ ఇండియా ఉపాధ్యక్షురాలు ఎం. వరలక్ష్మి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నాలో శనివారం ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా కార్యదర్శి రేవతి, నళిని కుమారి, రమాదేవి, విజయ లక్ష్మి, షేక్ మీంరాబీ, కాశేశ్వరి, హస్నాబి, షేక్ హలీమా, కనకరత్నం, స్వర్ణకుమారి, లక్ష్మీప్రసన్న, భవాని, త్రిమూర్తులు, టి. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకులు డిమాండ్ చేశారు. గన్నవరం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న ధర్నా శనివారానికి 40వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా తమ సమస్యలు పరిష్కారం అయ్యేదాకా ఆందోళనలు విరమించేది లేదన్నారు. సాంబ, రమా, లక్ష్మీ, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.





కంకిపాడు దీక్షలో మాట్లాడుతున్న అంగన్వాడీల నాయకురాలు వరలక్ష్మి, గన్నవరం దీక్షలో..



పోరంకి పార్టీ కార్యాలయంలో బీసీ నాయకులతో మాట్లాడుతున్న బోడె ప్రసాద్

బీసీలను చైతన్యపరిచాలి

టీడీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపు

పెనమలూరు, జనవరి 20 : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో త్వరలో జరగబోయే జయహో బీసీ సభలను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ బీసీ నేతల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 22న ఉయ్యూరులో, 23న పోరంకి, కంకిపాడుల్లో జరిగే సభల ద్వారా బీసీలను చైతన్యపరిచి టీడీపీకి మద్దతు పలికే విధంగా నియోజకవర్గంలో ఉన్న బీసీలందరూ కృషి చేయాలని కోరారు. సైకో జగన్ ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి బీసీలను అణగదొక్కే పనిలోనే ఉన్నాడని, అక్రమ కేసులు, అరెస్టులతో భయపెట్టే విధంగా చర్యలు చేపట్టాడని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ పాలనలో బీసీలకు జరిగిన అన్యాయాలపై నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ తిరిగి వివరించి చైతన్యవంతులను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, సంగెపు రంగారావు, శొంఠి శివరాంప్రసాద్, పీతా గోపీచంద్, తుమ్మలపల్లి హరికృష్ణ, వీరంకి కుటుంబరావు, దండమూడి చౌదరి, కొణతాల సుబ్రహ్మణ్యం, మాదు నాగరాజు, తమ్మ అశోక్, సుదిమళ్ల రవీంద్ర, జంపాన గుర్నాథం, మాదు రామకృష్ణ, జలాగ్ని మల్లయ్య, బొమ్మిడి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పనులు పారదర్శకంగా చేయించాలి

డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ



సామాజిక తనిఖీల్లో సిబ్బందిని ప్రశ్నిస్తున్న పీడీ సూర్యనారాయణ

గన్నవరం, జనవరి 20 : ఎన్ఆర్ఈజీఎస్ పనులను పారదర్శకంగా చేయించాలని, పేదలకు 100 రోజులు పని కల్పించటంతో పాటు ప్రత్యేక పర్యవేక్షణ తో సక్రమంగా పనులు చేయించాలని, లేకుంటే సిబ్బందిపై తగిన చర్యలు తప్పవని డ్వామా పీడీ జీవి సూర్యనారాయణ, ఎంపీడీవో సత్యకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం నిర్వహించారు. 2022-23 సంవత్సర కాలంలో మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై తనిఖీ నిర్వహించారు. పలు చోట్ల జరిగిన అవకతవకలపై సిబ్బందిని ప్రశ్నించారు. కొట్టివేతలు ఎందుకు ఉన్నాయని టెక్నికల్ అసిస్టెంట్ రాయప్పను ప్రశ్నించారు. రికార్డుల్లో తప్పులు ఎందుకు ఉన్నాయంటూ మండిపడ్డారు. ఏపీడీలు నాంచారరావు, లక్ష్మా రెడ్డి, రామ్మోహనరావు, ఎస్ఆర్‌పీ చిన్నబ్బాయి, ఏపీవో సత్యప్రియ, క్లస్టర్ సీవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఇంటి వద్దనే నేత్ర పరీక్షలు

పెనమలూరు : తాడిగడప ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి ఇబ్బందులు ఉన్న వారికి ఇంటి వద్దనే నేత్ర పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి ప్రతినిధి తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా హోమ్‌కేర్ నేత్ర పరీక్షల సేవలను ఆవిష్కరించినట్లు తెలిపారు. వృద్ధుల కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వివరాల కోసం 0866 6712000-20 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



పాదయాత్ర చేస్తున్న అశోక్‌కుమార్‌కు వీరవల్లిలో స్వాగతం పలుకుతున్న నాయకులు

హనుమాన్‌జంక్షన్ / రూరల్, జనవరి 20 : అన్ని రంగాల్లో వెనుకబడ్డ రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించే సత్తా ఉన్న నాయకుడు చంద్రబాబునాయుడు మాత్రమేనని తెలుగు యువత నాయకుడు అశోక్‌కుమార్ అన్నారు. చంద్రబాబు సీఎం కావాలని కోరుతూ, ఇచ్ఛాపురం నుంచి తిరుమల తిరుపతి వరకు చేపట్టిన పాదయాత్ర శనివారం కృష్ణాజిల్లాలో హనుమాన్‌జంక్షన్ వద్ద ప్రవేశించింది. పాదయాత్రకు టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాలరాజేశ్వరావు, నాయకులు వేగిరెడ్డి పాపారావు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అశోక్‌కుమార్‌ను అభినందిస్తు పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేమూరి శ్రీనివాసరావు, పావులూరి రామారావు, వడ్డి వాసవి, తదితరులు పాల్గొన్నారు. ● యువతకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటే టీడీపీతోనే సాధ్యమని ఇచ్ఛాపురానికి చెందిన తెలుగు యువత నాయకుడు అశోక్‌కుమార్ అన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ కాలినడకన ఇచ్ఛాపురం నుంచి తిరుమల వెళుతున్న అశోక్‌కుమార్‌కు శనివారం వీరవల్లి వద్ద తెలుగు యువత జిల్లా కార్యదర్శి మండాది రవీంద్ర, ఎన్నారై ఈలప్రోలు నళినీకాంత్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నందమూరి కృష్ణారావు, జామి ఉమామహేశ్వరరావు, గండి శ్రీనివాసరావు, పామర్తి మాధవరావు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గన్నవరంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ

గన్నవరం : జగన్మోహన రెడ్డి నాశనం చేసిన ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలంటే మళ్లీ చంద్రబాబు నాయుడు సీఎం కావాలని టీడీపీ టౌన్ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ అన్నారు. గన్నవరం పట్టణంలో శనివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ, ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం 132, 133, 142 బూత్‌లలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాస్తి శ్రీధర్ మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. వైసీపీ ప్రభుత్వ నాలుగున్నరేళ్ల కాలంలో రాష్ట్రానికి జరిగిన మేలు ఏమి లేదన్నారు. ఉన్న పరిశ్రమలు పోవడంతో రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. టీడీపీతోనే అందరికీ ఉపాధి అన్నారు. ఆరిఫ్‌ఖాన్, ఆసిఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

తానా కార్యదర్శిగా రాజా ఎన్నిక జిల్లాకే గర్వకారణం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 20 : అమెరికాలో అతిపెద్ద తెలుగు సంఘమైన తానా(ఉత్తర అమెరికా తెలుగు సంఘం) కార్యదర్శిగా రాజా కసుకుర్తి, సంయుక్త కార్యదర్శిగా వెంకట్ కోగంటి ఎన్నికవడం కృష్ణాజిల్లాకే గర్వకారణమని ఆళ్ల గోపాలకృష్ణ, గుండపనేని ఉమావరప్రసాద్, తదితర టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికైన వారికి శనివారం ఫోన్ ద్వారా అభినందనలు తెలియజేస్తూ తెలుగుప్రజలకు సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రంగన్నగూడెం సర్పంచ్ కసుకుర్తి రంగామణి, పుసులూరి లక్ష్మీనారాయణ, మొవ్వా శ్రీనివాసరావు, తుమ్మల దశరథరామయ్య, కసుకుర్తి కృష్ణకిషోర్, వేణుబాబు, వీరవల్లికి చెందిన కలపాల రాజాబాబు, లంక సురేంద్ర మోహన బెనర్జీ, మండాడి రవీంద్ర, ఎంపీటీపీ అమృతపల్లి సూర్యనారాయణ, లంక అజయ్‌కుమార్ అభినందనలు తెలిపారు.

బాధిత కుటుంబానికి మానవత ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్, జనవరి 20 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుటుంబానికి మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ వైద్య ఖర్చులు నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సాయం శనివారం అందజేసింది. స్థానిక మహాత్మగాంధీ నగర్ కాలనీకి చెందిన పల్లెపు జాన్, భార్య మల్లేశ్వరి, కుమారుడు రాజు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబాన్ని మానవత సభ్యులు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మారుబోయిన కోటేశ్వరరావు, సుబాచారి, నారాయణరావు, రాజేశ్వరరావు, గంటా సత్యనారాయణ, ఇందిరా దేవి, సత్యనారాయణ, సూర్యనారాయణ, కొండలరావు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

ఇరువర్గాల మధ్య ఘర్షణ.. కేసులు నమోదు చేసిన పోలీసులు

కంకిపాడు, జనవరి 20 : పెళ్లి చేసుకొని పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించిన ప్రేమ జంట. ఇరువర్గాలకు నచ్చ చెప్పి పంపించిన పోలీసులు..పోలీసు స్టేషన్ నుంచి ఇంటికి వెళ్లే మార్గ మధ్యలో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దిగడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పునాదిపాడుకు చెందిన నెరుసు శివప్రసాద్ కుమార్తె చేతనకు గత కొంత కాలంగా అదే గ్రామానికి చెందిన లోయ విజయకుమార్‌తో ప్రేమ వ్యవహారం నడుస్తోంది. శనివారం వీరిద్దరు వివాహం చేసుకొని రక్షణ కల్పించాలని కోరుతూ కంకిపాడు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. ఇరువురి తల్లిదండ్రులను ఎస్సై కె. సుధాకర్ పిలిపించారు. కౌన్సెలింగ్ ఇచ్చి ఉదయం మళ్లీ రావాలంటూ పంపించి వేశారు. ఈ లోపు పోలీసుస్టేషన్‌కు ఇరు వర్గాలకు చెందిన బంధువులు చేరుకున్నారు. ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. శివప్రసాద్‌కు చెందిన కారును విజయకుమార్ తరుపున వచ్చిన యువకులు ధ్వంసం చేశారు. రోడ్డుపై ఇరువర్గాలు కొట్టుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై కె. సుధాకర్ సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెల్లా చెదురు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

మత్తుతో జీవితాలు చిత్తు

విజయవాడ రూరల్, జనవరి 20 : యువతమత్తు పదార్థాలతో జీవితాలను చిత్తు చేసుకోవద్దని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. పాతపాడు గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బందికి మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన సదస్సును బాలభవన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో చెన్నకేశవ, వలంటీర్లు పాల్గొన్నారు.

కోదండ రామాలయానికి రూ. లక్ష విరాళం

గన్నవరం, జనవరి 20 : సమాజాభివృద్ధికి దాతల సహకారం అవసరమని పలువురు వ్యక్తలు పేర్కొన్నారు. మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని బుద్ధవరం కోదండ రామాలయ అభివృద్ధికి రూ.1,01,116 లక్షలు విరాళాన్ని శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేల్పుల బసవరావు, తోట వెంకయ్య, యర్రం శెట్టి రామాంజనేయులు, గుర్రం బుజ్జి, దేవరపల్లి సుశీల, గొంధి రాణి ముద్రబోయిన వెంకటేశ్వరరావు, నక్కా కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	208
చికెన్ స్కిన్‌లెస్	218



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.42

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



మోపిదేవి : పెదప్రోలు గ్రామంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి బొర్రా నాగరాజు (45) మృతి చెందాడు. నాగరాజు రోజు వారీ కార్యక్రమంలో భాగంగా పశువులకు మేత కోసుకొచ్చేందుకు ఉద యాన్నే చెరువు గట్టుకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు గాలిస్తూ చెరువు గట్టు వద్దకు వెళ్లారు. నాగరాజు చెరువులో శవమై తేలియాడుతూ కనిపించాడు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రాస్తారోకోతో అంగన్వాడీల సమ్మె ఉధృతం

గుడివాడ, జనవరి 20 : గత 40 రోజులుగా సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలపై రాష్ట్రప్రభుత్వం ఎస్మా ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ ప్రజాసంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. శనివారం గుడివాడ-విజయవాడ మార్గంలో రైల్వే ఫ్లైఓవర్ ప్రధాన రహదారి వద్ద రాస్తారోకో నిర్వహించాయి. ప్రజాసంఘాల నాయకులు ఆర్‌సిపి రెడ్డి, గూడపాటి ప్రకాష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలన్నారు. ఆందోళన విరమించాలని పలు మార్లు పోలీసులు కోరినా ప్రజా సంఘాల నాయకులు ససేమిరా అన్నారు. దీంతో బలవంతంగా ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. **చల్లపల్లి :** అంగన్వాడీ కార్యకర్తల పట్ల ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేస్తూ బస్టాండ్ సెంటర్‌లో అఖిలపక్ష నేతలు రాస్తారోకో నిర్వహించారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు దీక్షలు విరమించేది లేదనీ, అంగన్వాడీ కార్యకర్తలకు తమ మద్ధతు ఉంటుందని నేతలు స్పష్టం చేశారు. రాస్తారోకోతో ట్రాఫిక్ నిలిచిపోగా, చల్లపల్లి ఎస్సై సిహెచ్.చిన్నబాబు ఆందోళన జరుగుతున్న ప్రదేశానికి వచ్చి రాస్తారోకో విరమింపచేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.పోలినాయుడు, వివిధ పార్టీల నేతలు యద్ధనపూడి మధు, పైడిపాముల కృష్ణకుమారి, మోర్ల రాంబాబు, మల్లుపెద్ది రత్నకుమారి, పరుచూరి జనార్ధన్, చాట్రగడ్డ సుధీర్, మహమ్మద్ కరీముల్లా, వెనిగళ్ల వసంతరావు, బండి ఆదిశేషు, షేక్ నబీషోరి, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



గుడివాడలో రాస్తారోకోలో చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు ఆర్‌సిపి రెడ్డి, ప్రకాష్‌బాబు



చలపల్లిలో రాస్తారోకోలో పాల్గొన్న సీఐటీయూ నేత పోలినాయుడు

టీడీపీ నేతల సంఘీభావం

అవనిగడ్డ : అంగన్వాడీల సమస్యలను తక్షణం పరిష్కరించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. అవనిగడ్డలో గడిచిన 40 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ వర్కర్లకు శనివారం టీడీపీ నాయకులు యాసం చిట్టిబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, మాచవరపు ఆదినారాయణ, మండలి రామ్మోహనరావు, వాసు, అంగన్‌వాడీ సంఘ నేతలు నిర్మలా జ్యోతి, నాగమణి, సువర్ణ, సుశీల తదితరులు సంఘీభావం తెలిపారు.



రూ.5 లక్షల నగదు సీజ్

పెడన : సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలీసులు కొంత కాలంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. గుంటూరు నుంచి పాలకొల్లు వెళుతున్న కారును తోటమూల సెంటర్‌లో తనిఖీ చేయగా, రూ. 5 లక్షలు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. గుంటూరుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కొండవీటి శ్రీనివాసరావు డబ్బుకు తగిన పత్రాలు చూపలేకపోయారు. దీంతో పోలీసులు ఆ డబ్బును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రవిచంద్రకుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులో శనివారం సాయంత్రం 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై పి విశ్వనాథ్ తెలిపారు. ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గుడివాడ : ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ పాటించి సుఖవంతమైన ప్రయాణాలు చేయాలని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ కోరారు. నెహ్రూ చౌక్ సెంటర్‌లో ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నియమాల కరపత్రాలను పంపిణీ చేశారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

తోట్లవల్లూరు : రొయ్యూరులో మోర్ల పద్మ శుక్రవారం సాయంత్రం ఇంటివద్ద పుల్లలు తీస్తుండగా పాముకాటుకు గురై మృతి చెందింది. ఎస్సై పి విశ్వనాథ్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వనమలమ్మ జాతర

మచిలీపట్నం టౌన్ : నిజాంపేటలో ఆది వనమలమ్మ దేవి వార్షిక గ్రామో త్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. అమ్మవారినిమేళతాళాలు, కనకతప్పెట్లతో, విచిత్ర వేషధారణలతో ఊరేగింపు జరిపారు. భక్తులు మొక్కుబడులు సమర్పించుకున్నారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. నూతి వన వీరవెంకట సత్యనారాయణ, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మిక సంఘం మహాసభను జయప్రదం చేయండి

పామర్రు : కల్లుగీత కార్మికుల పట్ల వైసీపీ ప్రభుత్వ నిరకుంశ విధానాలకు వ్యతిరేకంగా తణుకులో ఈనెల 30, 31న నిర్వహించే గీత కార్మిక సంఘం మహాసభలను జయప్రదంచేయాలని జిల్లా కల్లుగీత కార్మికుల సంఘం కార్యదర్శి వాకా రామచంద్రరావు కోరారు. సీఐటీయూ కార్యాలయంలో శనివారం కల్లుగీత సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మహాసభలో భవిష్యత్ ప్రణాళికను నిర్ణయించడం జరుగుతుందన్నారు. పామర్తి వెంకటేశ్వరరావు (బందరు) కాగిత అజయ్ బాబు (గుడ్లవల్లేరు), ఏసేబు, పిల్లి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ చొరవతో చల్లపల్లి పంచాయతీకి బకాయి సొమ్ము జమ

చల్లపల్లి : ఎస్పీ పి.జాషువా చొరవతో చల్లపల్లి గ్రామ పంచాయతీకి పాత బకాయి తీరింది. చల్లపల్లిలోని పోలీస్ సిబ్బంది క్వార్టర్స్, ఎస్సై క్వార్టర్, పోలీస్‌స్టేషన్ ఇంటి పన్ను, నీటికుళాయి పన్ను 1997-98 ఆర్థిక సంవత్సరం నుంచి 2022-23 సంవత్సరం వరకు రూ.5,25,765 బకాయి పేరుకుపోయింది. ఈ మొత్తం జిల్లా ఎస్పీ చొరవతో గ్రామ పంచాయతీ ఖాతాకు జమఅయ్యాయి. దాదాపు 25 ఏళ్ల బకాయిలు ఒకేసారి చెల్లింపు జరిగేందుకు కృషి చేసిన ఎస్పీ పి.జాషువా, అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్, చల్లపల్లి సీఐ సిహెచ్.నాగప్రసాద్, ఎస్సై సిహెచ్.చిన్నబాబులకు చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు ధన్యవాదాలు తెలిపారు.

అన్నదానం

అవనిగడ్డ రూరల్ : డొక్కా సీతమ్మ పేరుతో పెట్రోల్ బంకు వద్ద గరికపాటి రామ్, వివేక్, మిత్ర బృందం ఆధ్వర్యంలో 200 మందికి అన్నదానం చేశారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గుడివాక శేషుబాబు అన్నదానాన్ని ప్రారంభించారు. జనసేన నాయకులు పాల్గొన్నారు.

పల్లీలంటే అగ్నికుల క్షత్రియులే

నాగాయలంక : పల్లీలంటే అగ్నికుల క్షత్రియులేనని, ఎవరైనా అవగాహన లేక పల్లీలని చెబితే కులగణన అధికారులు అగ్నికుల క్షత్రియులుగా నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియుల సంక్షేమ సం ఘం అధికార ప్రతినిధి లకనం నాగాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అవనిగడ్డలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అగ్నికుల క్షత్రియులలో నిరాక్షరాస్యులు ఎక్కువగా ఉన్నందున కులం వివరాలు అడిగేటప్పుడు కొంతమంది ముఖ్యంగా మహిళలు అవగాహన లేక అనాదిగా పిలిచే పల్లికారులనో, మత్స్యకారులనో చెప్పే అవకాశం ఉందన్నారు. వీరందరినీ అగ్నికుల క్షత్రియులుగా పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

చల్లపల్లి : చల్లపల్లి లయన్స్‌క్లబ్ సామాజిక సేవ అభినందనీయమని ఎంపీడీవో సిహెచ్.చినరాట్నాలు అన్నారు. లయన్స్ మల్టీపర్పస్ సర్వీస్ సెంటర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వంశీ హార్ట్ కేర్ సెంటర్, హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీడీవో చినరాట్నాలు, డాక్టర్ పవన్‌కుమార్ ప్రారంభించారు. డాక్టర్ ఎం.గోపీచంద్, డాక్టర్ కె.వంశీకృష్ణ, డాక్టర్ రావెళ్ల కీర్తిక, డాక్టర్ తుంగల పవన్‌కుమార్ వైద్యసేవలందించారు. 90 మందికి గుండె,క్యాన్సర్ సంబంధిత పరీక్షలు, 54 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 15 మందిని ఐఓఎల్ శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మోపిదేవి వెంకటేశ్వరరావు, రాయపాటి రాధాకృష్ణ, క్లబ్ ప్రతినిధులు నర్రా సాయిబాబు, ముమ్మనేని నాని, టి.సాంబశివరావు, ఏఎల్ఆర్‌కె.ప్రసాద్, బాషా, కొల్లిపర మధు, హరిగోపాల్, ఎం.వి.కృష్ణారావు, కె.సుధాకర్ పర్యవేక్షించారు.



ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో చినరాట్నాలు

కళాకారులకు సత్కారం



మచిలీపట్నం టౌన్, జనవరి 20 : మహతి కళావేదికపై భావతరంగిణి ఆధ్వర్యంలో శనివారం ప్రతిభా పురస్కార ప్రదానోత్సవం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు నేతృత్వంలో జరిగింది. ప్రముఖ పద్యకవి డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ, హరికథకుడు మడమల రాంబాబు, భజన కళాకారుడు కుందా ఆంజనేయ శర్మ, యోగా మాస్టర్ సద్గుర్తి నాగశిరోమణి (విజయవాడ), కోలాటం కళాకారిణి గరిమెళ్ళ వెంకట బాలనాగమణిలకు పురస్కారాలు అందజేశారు. కళాత్మక దండల రూపశిల్పి సంకా లక్ష్మీకుమారి, కొమ్మూరి జయశ్రీలకు, ప్రముఖ కవి మేడిశెట్టి యోగేశ్వరరావు, బాల వికాసం కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కాపవరపు పావనిలకు అభినందన పురస్కారాలు అందజేశారు.సాహితీవేత్త డాక్టర్ జి.వి.పూర్ణచంద్ మాట్లాడుతూ, జానపదకళాకారులను ప్రోత్సహించాల్సిన సాహితీవేత్త సవరం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జి. రామబ్రహ్మం, న్యా యవాది జె. మల్లిఖార్జునప్రసాద్, కంచర్లపల్లి కృష్ణమోహ నరావు, ఆర్టీసీ డీఎం పెద్దిరాజులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గుడిపూడి రాధికారాణి, పోతురాజు, ఎల్. విజయలక్ష్మి, గురజాడ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కుర్మా శంకరరావుకు సత్కారం



పెడన : పెడనకు చెందిన చేనేత ప్రముఖుడు కుర్మా శంకరరావుకు ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. మంగళగిరి మార్కండేయపురం కల్యాణ మండపంలో ఏపీ చేనేత కార్మిక సంఘ రాష్ట్ర 13వ మహాసభ జరిగింది. ఈ మహాసభలో గౌరవ డాక్టరేట్ పట్టా పొందిన చేనేత కుటుంబానికి చెందిన శంకరరావును ఘనంగా సన్మానిం చారు. చేనేత ప్రముఖులు కట్టా హేమసుందరరావు, బండారు ఆనంద ప్రసాద్, పిల్లలమర్రి నాగేశ్వరరావు, బూసం బాలసుబ్రహ్మణ్యం, పేరిశెట్టి ఉమాకాంతం, కుర్మా విఘ్నేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బౌద్ధ స్థూపం వద్ద చెత్త డంపింగ్ నిరోధించాలి

గుడివాడ : పురావస్తు శాఖ ఆధ్వర్యంలోని బౌద్ధ స్థూపం వద్ద చెత్తాచెదారం వేయడాన్ని నిరోధించాలని కోరుతూ లిటిల్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు శనివారం మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. స్థూపం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పచ్చదనం ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. సంస్థ రాష్ట్ర సమన్వయకర్త హేమంత్ కుమార్ అల్లూరి, సంస్థ అధ్యక్షురాలు హరిత, ఉపాధ్యక్షుడు కల్యాణ్ నానుపాత్రుని, బి.కార్తీక్, చరణ్ జంపా, బాలాజీ, హర్ష, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.



వెనిగండ్ల రాము సమక్షంలో సత్యసాయి జన్మదిన వేడుక

గుడివాడ : టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి వేడుక నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము సమక్షంలో బైపాస్ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. రాము కేక్ కట్ చేసి సత్యసాయికి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు గుత్తా చంటి, దేవరపల్లి కోటి, సురేంద్ర, వీరవరపు వంశీ, పాపారావు, భాను, ఎల్లయ్య, నితీష్, నారగాని వంశీ, జాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వ్యాపార సంస్థల మూసివేత

మచిలీపట్నం టౌన్ : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ట నేపథ్యంలో సోమవారం నగరంలోని అన్ని వ్యాపార, వర్తక సంస్థలను మధ్యాహ్నం 2 గంటల నుంచి మూసివేస్తున్నట్టు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మద్దుల గిరీష్ ఒక ప్రకనటలో తెలిపారు.

వాలీబాల్ నెట్‌ల పంపిణీ

గుడివాడ రూరల్ : యువతకు ఆటల్లో నైపుణ్యం సాధించటానికి వాలీబాల్ నెట్‌లు అందజేస్తున్నట్లు మాజీ ఎంపీపీ గుత్తా రామకృష్ణ తెలిపారు. బొమ్ములూరు గ్రామంలో యువతకు వాలీబాల్ నెట్‌లను అందజేశారు.

హౌసింగ్ సమస్యలు ఏకరువు

అవనిగడ్డ రూరల్ : మండల సమావేశంలో హౌసింగ్ సమస్యలను ప్రజాప్రతినిధులు ఏకరువు పెట్టారు. ఎంపీపీ తుంగల సుమతిదేవి అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో హౌసింగ్ ఏఈ సురేంద్ర ఇళ్ల పురోగతిని వివరించారు. ఎంపీటీసీ సభ్యుడు బొప్పన భాను మాట్లాడుతూ తిప్పాలెం లే అవుట్‌లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించని కారణంగా కొందరు గృహాలు నిర్మించుకోలేదన్నారు. కో-ఆప్షన్ సభ్యుడు నజీర్ బాషా మాట్లాడుతూ అవనిగడ్డ షాదీఖానా సమీపంలో ఉన్న స్థలంలో హౌసింగ్ కోసం కొందరు దరఖాస్తు చేశారని, కేటాయింపునకు తహసీల్దార్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని తెలుపగా, దీనిపై తహసీల్దార్‌కు తాము కూడా వినతిపత్రం అందజేస్తామని ఏఈ చెప్పారు. ఎంపీడీవో మరియ కుమారి, సూపరింటెండెంట్ అటావుల్లా, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ విభజన-ప్రభావాలపై వర్క్‌షాప్

అవనిగడ్డ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర, అర్థశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ విభజన, కారణాలు - ప్రభావాలు అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ జరిగింది. తెలంగాణ విమోచన ఉద్యమ కారుడు, విశ్రాంత అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ తిప్పన సిద్ధులు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ విభజనకు దారి తీసిన ఆర్థిక కారణాలు, వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, విభజన ప్రభావం గురించి ఆయన వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పామర్రు అర్థశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్.మాధవి, అధ్యాపకులు డి.రాజ్యలక్ష్మి, వీర కుమారి, వైస్ ప్రిన్సిపాల్ రాజనాల అంకారావు, సంధ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేత కుటుంబయ్యకు పరామర్శ



తోట్లవల్లూరు : కుమ్మమూరు టీడీపీ నేత, జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షుడు రామినేని వెంకట నరసింహ కుటుంబరావు(కుటుంబయ్య)కు శుక్రవారం పితృవియోగం జరిగింది. ఆయన తండ్రి రామినేని సత్యనారాయణ(91) అనారోగ్యంతో కన్నుమూశారు. శనివారం మాజీ మంత్రి, పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని, జిల్లా తెలుటీడీపీ అధ్యక్షుడు కొనకళ్ళ నారాయణరావు తదితర ప్రముఖులు సత్యనారాయణకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.